క్లుప్తంగా

సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాటూరి వెంకటేశ్వరరావు



నూతన కార్యవర్గంలో కాటూరి (కుడి చివర)

తెనాలి: ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సాంస్కృతిక విభాగం సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ శాఖ ఉపాధ్యక్షుడిగా తెనాలికి చెందిన ప్రముఖ శిల్పి 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ సమావేశంలో ఆదివారం సాయంత్రం విశాఖపట్నంలోని బీవీకే కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఇదే సమావేశంలో రాష్ట్ర శాఖకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంస్థ అధ్యక్షుడిగా పీవీఎన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుంటల రామ్‌కుమార్, కార్యదర్శిగా పి.రంగమన్నార్, దృశ్యకళల సమయోజకులుగా అల్లు రాంబాబు నియమితులయ్యారు. రాష్ట్ర అఖిల భారత కార్యదర్శి అసుతోష్ ఆడోని (నాగపూర్) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై స్పందించాలి

సీఐటీయూ నాయకులు కె.బి.ప్రసాద్



తెనాలిఅర్బన్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని సీఐటీయూ నాయకులు కె.బి.ప్రసాద్ కోరారు. తెనాలి ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవటం బాధాకరన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ హుస్సేన్ వలీ, సురేష్, దిలీప్ కుమార్, చక్రి, గోపికృష్ణ, ప్రశాంత్, ప్రదీప్, గౌస్, రత్నకుమారి, రాజ్యలక్ష్మి, లీలావతి, సునీల్, సతీష్, శ్రీధర్, ఎం.కృష్ణ, కరిముల్లా, ఈశ్వరరావు, కిరణ్ కుమార్, ఉపేంద్ర పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: వెస్ట్ బెర్రి ఓపెన్ చెక్ ఛాంపియన్ షిప్‌లో తెనాలి మారీసుపేట రెండుగేట్ల మధ్యంలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు చావలి జోనాతాన్ జోసఫ్, సొపాటి కృతిక్ సంగీత్‌లు మెడల్స్ సాధించారని స్కూల్ డైరెక్టర్‌లు చావలి అకుల్ నాథ్, చావలి తేజోనాథ్‌లు పేర్కొన్నారు. పోటీలను ఆదివారం తెనాలిలో నిర్వహించినట్లు తెలిపారు. వీరికి సోమవారం పాఠశాల ఆవరణలో అభినందనలు తెలిపి మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దివ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి



తెనాలి టౌన్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ పాల్గొని సీడీపీవో పి.విజయ గౌరికి వినతి పత్రం అందజేశారు. ఫేస్ రికగ్నిజేషన్ రద్దు చేయాలని, పాత పద్ధతిలో లబ్ధిదారులకు ఫీడింగ్ ఇచ్చేల చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2022 లో ఇచ్చిన ఫోన్‌లు సరిగా పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏవీయన్ కుమారి ప్రాజెక్ట్ కమిటీ ప్రెసిడెంట్ వి.విజయలక్ష్మి, షేక్ హసీన భేగం, లావణ్య, సునీత, సుజాత, కనక దుర్గ, పావని, నిర్మల, రాధిక, జరినా బేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై 14 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశానికి మొత్తం 14 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్ బాబు అర్జీలను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పోలీస్ శాఖకు సంబంధించి రెండు అర్జీలు రాగా, టౌన్ ప్లానింగ్‌కు చెందినవి మరో రెండు అర్జీలు వచ్చాయి. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

పనులు ఎప్పటికి పూర్తవుతాయో?

- మందకొడిగా సాగుతున్న మున్సిపల్ తాత్కాలిక భవన నిర్మాణ పనులు
- మంత్రి ఆదేశాలకు అధికారులు తూట్లు
- ఇంకా నెలరోజులు పట్టే అవకాశం

ఒకడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి..!



నిర్మాణంలో ఉన్న చాంబర్



సిద్ధమౌతున్న గదులు

తెనాలిఅర్బన్: ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాలను జూన్ నాటికి మార్కెట్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక కార్యాలయంలోకి మార్పు చేయాలంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. కానీ జులై నెల చివరకు వస్తున్న నేటికీ మార్పు జరగలేదు. దీనికి కారణం తాత్కాలిక భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగడమేనని తెలుస్తోంది. తెనాలి పురపాలక సంఘ కార్యాలయాన్ని 1966లో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మెయిన్ రోడ్డు వైపు వ్యాపార దుకాణాలను, మొదటి, రెండు అంతస్తుల్లో మున్సిపాలిటీలోని వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు.

2006లో మున్సిపల్ భవనానికి అనుబంధంగా వెనుక వైపున ఒక భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మెప్మా, హెల్త్ సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో కౌన్సిల్ హాలును నిర్మించారు. ఈ భవనానికి తూర్పువైపున మెప్మా షెడ్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ చాంబర్లు, రెవెన్యూ, అకౌంట్, ఆడిట్ సెక్షన్లు, టౌన్ ప్లానింగ్, మెప్మా, ఆరోగ్య విభాగాలు నడుస్తున్నాయి. శాశ్వత ఉద్యోగులు 229 మంది కాగా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 480 మంది వరకు పని చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం రోజూ వందలాది మంది కార్యాలయానికి వస్తుంటారు.

శిథిలావస్థకు చేరిన భవనం..

తెనాలి పురపాలక సంఘ కార్యాలయంను నిర్మించి 59 సంవత్సరాలు కావటంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. అలాగే గోడలు కూడా నెర్రిలిస్తుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతూ వస్తున్నారు. దీనిలో పీపీపీ పద్ధతిలో నూతన భవనం నిర్మించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భావించి ప్రభుత్వ అర్కిటెక్‌ను మేనెలలో పిలిపించి డిజైన్‌లు తయారు చేయించి వాటిలో ఒకదానికి ఆమోదం తెలిపారు. జూన్ నాటికి పాత భవనాన్ని ఖాళీ చేయాలని అప్పట్లో ఆయన ఆదేశించారు.

నిదానంగా పనులు...

మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాలను కార్యాలయం ముందు ఉన్న మార్కెట్ కాంప్లెక్స్‌లోని రెండు, మూడు అంతస్తులలోకి మార్పు చేయాలని భావించారు. దీనిలో చైర్‌పర్సన్, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ చాంబర్‌లతో పాటు కౌన్సిల్ హాల్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, రెవెన్యూ, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, మేనేజర్, ఆడిట్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీనికోసం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.38 లక్షలు వెచ్చించారు. ఇది జరిగి నెలలు దాటుతున్నా పనులు మాత్రం ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందానా సాగుతున్నాయి. ప్రస్తుతం కౌన్సిల్ హాల్ పనులు జరుగుతున్నాయి. మిగిలిన చాంబర్‌ల పనులు జరుగుతున్నాయి. ఇవన్ని పూర్తి కావడానికి ఇంకా నెల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కాంప్లెక్స్ శ్లాబ్‌కు లీకులు!

ఇదిలా ఉంటే మార్కెట్ కాంప్లెక్స్ శ్లాబ్ వర్షం కురిసినప్పుడు అక్కడక్కడా కారుతున్నట్లు తెలిసింది. శ్లాబ్‌పై ఫ్లోరింగ్ లాగాల్సిన అవసరం ఉంది. దీని కోసం మరో రూ.20 లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు నేటికి దానికి సంబంధించిన అనుమతులను కౌన్సిల్ నుంచి తీసుకోలేదు. కౌన్సిల్ అనుమతులు తీసుకుని పనులకు టెండర్లు పిలచి పనులు ప్రారంభించడానికే మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పనుల వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వచ్చే నెలలో పూర్తి చేస్తాం



మున్సిపల్ కాంప్లెక్స్‌లో నిర్మిస్తున్న తాత్కాలిక మున్సిపల్ కార్యాలయం భవనం నిర్మాణ పనులు కొంత ఆలస్యమయ్యాయి. పనులను వేగవంతం చేశాం. అగస్టు మొదటి వారంలో పనులన్ని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు పూర్తి కాగానే అన్ని విభాగాలను అక్కడికి మార్పు చేసే అవకాశం ఉంది. పై శ్లాబ్‌లో ఒక మూల నీరు కారుతున్న ట్లు గుర్తించాం. దానికీ మరమ్మతులు చేయిస్తాం.

– పి.శ్రీకాంత్, మునిసిపల్ ఇంజనీర్

మానవ అక్రమ రవాణాపై అవగాహన



తెనాలిరూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో మానవ అక్రమ రవాణాపై సోమవారం రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, క్రాఫ్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జూలై 30న మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి 30 వరకు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రైల్వేస్టేషన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీరా సింగ్, ఏఎస్ఐ ఆర్‌వీ శివారెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నేరమని, దానిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. అక్రమ రవాణాపై ఎలాంటి సమాచారం ఉన్నా టోల్ ఫ్రీ నంబర్లు 1098, 1800, 1027 222 కు సమాచారం ఇవ్వాలని కోరారు. క్రాఫ్ట్ తెనాలి కమ్యూనిటీ సోషల్ వర్కర్ పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి బాల కార్మికులను పనుల నిమిత్తం రైళ్లలో తరలిస్తున్నారని, అటువంటి వారిని గుర్తించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు కాని, జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా పక్షోత్సవానికి సంబంధించిన ప్రచార బ్యానర్ లను రైల్వే స్టేషన్ ముఖద్వారం, రైల్వే బుకింగ్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, క్రాఫ్ట్ సంస్థ బృందం పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ యాక్టు సబ్ డిస్ట్రిక్ తెనాలి లెవల్ సలహా సంఘ సమావేశాన్ని సోమవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రవేట్ వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్, లేబరేటరీ నిర్వాహకులు లింగ నిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇవ్వకూడదని సూచించారు. అలా చేసిన వారికి మూడు సంవత్సరాల జైలు, రూ.50వేల అపరాధ రుసుం విధించటం జరుగుతుందన్నారు. అలాగే వైద్య మండలి ధ్రువీకరణ పత్రాన్ని అయిదు సంవత్సరాల పాటు రద్దుచేయటం జరుగుతుందని తెలిపారు. రెండవ సారి కూడా ఇలా చేస్తే అయిదు సంవత్సరాల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. ఆడపిల్లలను తక్కువ చూపుతో చూడవద్దన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ సురేష్, డాక్టర్ మానస, డాక్టర్ వేముల ప్రియాంక, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వర రావు, నాళం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో కుండపోత వర్షం



తెనాలిలో కురుస్తున్న వర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావం వల్ల పట్టణంలో సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాచినా మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చల్లబడింది. సాయంత్రం చిరుజల్లులతో కూడిన వర్షంతో ప్రారంభమై కొద్దిసేపటికి భారీగా కురిసింది. వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వేళ ఆఫీసులు, విద్యాసంస్థలు వదిలే సమయం కావటంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

రెండు మండలాల్లో ఎడతెరిపిలేని వర్షాలు



వెదపద్ధతి ద్వారా సాగు చేసిన వరినాట్లు వర్షాలకు నీటిలో పూర్తిగా మునిగిన దృశ్యం



కొల్లిపర మండలం శిరిపురంలో నీట మునిగిన వరి పొలాలు

కొల్లిపర: గత మూడు రోజులుగా మండలంలో కుంభవృష్టిగా వర్షం కురుస్తోంది. దీంతో గ్రామాల్లో, పల్లపు ప్రాంతాల్లో రోడ్లన్నీ వర్షం నీటితో మునిగిపోతున్నాయి. దీనికితోడు మురుగు కాల్వలో నీరు పారుదల లేకపోవటంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని ప్రదేశాలల్లో మురుగు రోడ్లపై ప్రవహించటంతో పాదచారులకు ఇబ్బంది ఎదురువుతోంది. ఇదిలా ఉంటే ఇటీవల 80 శాతం మంది రైతులు వెద పద్ధతి ద్వారా వరి నాట్లు వేశారు. మండలంలో సుమారు 4 వేల ఎకరాల్లో వర్షంపై ఆశతో ట్రాక్టర్ల ద్వారా జూన్ మొదటి వారంలో వెద పద్ధతిలో వరి విత్తనాలను నాటారు. మొదటిలో అడపాదడపా చిరుజలుల్లు పడ్డాయి. తరువాత ఎటువంటి వానలు లేకపోవటంతో చేసేది ఏమి లేక రైతులు బోర్లు ద్వారా వరికి నీరు అందించారు. చాలా మంది వరి మొదటి నీటి తడి అందించారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావటం గత మూడు రోజుల నుంచి అనుకున్న దాని కంటే ఎక్కువ శాతం వర్షాలు పడటంతో పల్లపు ప్రాంతాలల్లోని వెద పద్ధతి ద్వారా వరినాట్లు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెద పెట్టిన తరువాత వర్షాలు లేకపోవటంతో బోర్లు ద్వారా నీరు అందించారు. ఇప్పుడు కుంభవృష్టిగా వర్షం కురవడంతో వరి పంట పొలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉండటంతో వరి మొక్క కుళ్ళిపోయి ఎక్కడ నష్టం జరుగుతుంది అనే ఆవేదనతో వర్షం నీరు బయటకు పంపిస్తున్నారు. అదే విధంగా మరో మూడు రోజులు వర్షాలు ఉంటే ఇప్పుడే మొలక వస్తున్న వరి గింజలు నీటిలో మునిగి చనిపోతాయి. వాటి స్థానంలో వరి నారు కొని వేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వెద పద్ధతి ద్వారా వరి నాట్లు వేయని రైతులు, వాణిజ్య పంటలైన పసుపు, అరటి, కూరగాయల రైతులు ఈ వర్షానికి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కారణంగా మాగాణిలో నీరు ఎక్కువ మొత్తంలో చేరాయి. వెంటనే వరి నారు కొని నాట్లు వేయాలని అని సన్న హాలు చేస్తున్నారు.

భారీ వర్షాలతో రైతుల్లో దిగులు

తెనాలిరూరల్: భారీ వర్షాలు రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా ఖరీఫ్‌కు సమాయత్తమైన రైతులు వెద పద్ధతిలో సాగుకు శ్రీకారం చుట్టారు. అయితే భారీ వర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలచిపోతుండడంతో విత్తనాలు మొలకెత్తవన్న దిగులు రైతన్నలలో వ్యక్తమవుతోంది. తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం కురిసిన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. అత్యధికంగా కాకుమాను మండలంలో 86.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా తెనాలిలో 22.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అలాగే తాడేపల్లిలో 32.4, మంగళగిరిలో 53.6, దుగ్గిరాల మండలంలో 48.6, కొల్లిపర మండలంలో 67.4, చేబ్రోలు మండలంలో 36.2, పొన్నూరు మండలంలో 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డివిజన్ మొత్తం మీద 387.4 మిల్లి మీటర్లు, డివిజన్ సరాసరి 48.4 మిల్లీమీటర్లగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులు కోరుతున్నారు.

కాల్వల్లో షిల్టు తొలగించండి



తెనాలిఅర్బన్: మారీసుపేటలో ప్రధాన కాల్వల నుంచి తీసిన షిల్ట్‌ను రోడ్లపై పోశారు. ఇలా జరిగి రోజులు దాటుతున్న దానిని ఇప్పటి వరకు తొలగించలేదు. దానిని తీయించాలని ఆప్రాంత వాసి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన రెండు, రెవెన్యూవి ఒకటి, శానిటేషన్‌వి రెండు అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, మేనేజర్ విల్సన్ జయకర్, ఎసీపీ శివన్నారాయణ, ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మాస్టర్ ఎం.చిన్నాకు అవార్డు



తెనాలి: పట్టణానికి చెందిన హరి హంసిక డాన్స్- తైక్వాండో క్లబ్‌కు చెందిన మాస్టర్ ఎం.చిన్నాకు వైఎంకే అకాడమీ 'నేషనల్ స్టార్ షైనింగ్ స్టార్' పేరుతో లైఫ్‌టైమ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసింది. విజయవాడ అజీత్‌సింగ్ నగర్‌లోని గుజ్జుల సరళాదేవి ఫంక్షన్ హాలులో ఆదివారం వివిధ విభాగాల్లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో మార్షల్ ఆర్ట్స్ కేటగిరిలో చిన్నా ఈ గౌరవాన్ని అందుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగంలో గల అత్యుత్తమ ప్రతిభ అంకితభావం కోసం నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. సినీ హీరో భానుచందర్, వైఎంకే అకాడమీ చైర్మన్ డాక్టర్ సుమన్ తల్వార్, గ్రాండ్ మాస్టర్ జి.ప్రకాష్ రావు ముఖ్య అతిథులుగా అవార్డులను బహూకరించారు. ఈ సందర్భంగా మాస్టర్ చిన్నా మాట్లాడుతూ, 'ఈ అవార్డు నాకు గొప్ప గౌరవం...ఇది నా శిష్యుల ప్రోత్సాహం, నా కుటుంబం సహకారం వల్ల సాధ్యమైంది. ఇది మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రేరణ ఇస్తుంది' అన్నారు.

పురమిత్ర యాప్‌ను అందరూ ఉపయోగించుకోండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పురమిత్ర యాప్‌ను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా 150 రకాల సేవలు ప్రజలు పొందవచ్చని తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లేస్టోర్‌లో యాప్ అందుబాటులో ఉందన్నారు. పురపాలక సంఘ పరిధిలోని రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ తదితర సమస్యలను దాని ద్వారా తెలియజేయవచ్చన్నారు. అలాగే ఇంటి, ఖాళీ స్థల పన్నులతో పాటు జనన, మరణ ధృవీకరణ, వివాహ ధృవీకరణ పత్రాలు పొందవచ్చని చెప్పారు. నిరక్షరాస్యులు సైతం వినియోగించుకునేలా దీనిలో వాయిస్ బేసుడు ఫీచర్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమస్యకు సంబంధించిన ఫోటోను కూడా అప్‌లోడ్ చేయవచ్చన్నారు. సమస్య తీవ్రతను బట్టి మూడు నుంచి 30 రోజుల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రజలందరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దీని సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

సినిమా పాటకు జీవం పోసిన సంగీత బ్రహ్మ ఇళయరాజా

ఇళయరాజా సినీసంగీత విభావరిలో ఎస్‌బీఐ ప్రాంతీయ అధికారి జగదీశ్‌కుమార్



గాయని హిమబిందుకు సత్కారం

తెనాలి: సినిమా పాటకు జీవం పోసిన సంగీత బ్రహ్మ ఇళయరాజా అని భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రాంతీయ అధికారి డాక్టర్ జగదీశ్‌కుమార్ అన్నారు. ఆయన స్వరపరచిన పాటలు ప్రేక్షకుల హృదయాల్లో పదికాలాలపాటు చిర స్థాయిగా ఉంటాయని చెప్పారు. పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయవేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపరచిన గీతాలతో 'ఇళయరాజా సంగీత విభావరి'ని నిర్వహించారు. ఇళయరాజా సినీ పరిశ్రమకు పరిచయమైన 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఇక్కడి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ విభావరిని నిర్వహించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యవర్గసభ్యురాలు నిర్మల (చెన్నై) సంగీత విభావరిని ప్రారంభించారు. స్వరలయ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు ప్రసంగిసూ 16 వేల పాటలకు సంగీతం సమకూర్చిన ఇళయరాజా కారణజన్ములని అన్నారు. స్వరలయ వేదిక 527వ కార్యక్రమంగా నిర్వహించినట్టు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు దైవాల వెంకట సుబ్రమణ్యేశ్వర రావు, డాక్టర్ జాస్తి వేంకట సుబ్బారావు, రావిపాటి ప్రేమకుమార్, మణికంఠ మాట్లాడారు. తెనాలికి చెందిన గాయని హిమబిందును ఇదే వేదికపై సత్కరించారు. గాయనీ గాయకులు సత్యవర్ధన్, విష్ణుప్రియ, సాంబశివరావు, శిరీష, డాక్టర్ సత్యనారాయణలు పాటలను గానం చేశారు.

లంకవాసులు.. అప్రమత్తంగా ఉండండి

కొల్లిపర: గత నాలుగు రోజులుగా పలుచోట్ల కురుస్తున్న వర్షాలకు సాగర్ డ్యాం నుంచి 3 లక్ష వరద నీరు సోమవారం కృష్ణా నదికి వదలిన నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.సిద్దార్ధ, ఎంపీడీవో వి.విజయలక్ష్మిలు సూచించారు. సోమవారం వారిరువురు కృష్ణా నది రేవులను పర్యవేక్షించి అనంతరం లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ నదిలోకి వరద నీరు చేరటం వలన లంక గ్రామాలకు, కూలీ పనులకు వెళ్లే వారు వరద ఉధృతి తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయంలో పడవ వేయు వారికి తప్పని పరిస్థితిలోనే మాత్రం పడవ వేయాలని హెచ్చరించారు. నది తీవ్రత ఉన్నపుడు పిల్లలు, వృద్ధులు ఇటు వైపు రాకుండా ఉండేలా గ్రామ పెద్దలు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో, సచివాలయం సిబ్బందితో, వీఆర్‌వోలతో మాట్లాడుతూ గ్రామాలోని పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలిన చేస్తు తమకు తెలపాలన్నారు. రానున్న రోజుల్లో వరద ఉధృతి పెరిగే విధంగా ఉంటే లంక ప్రజలను తూములూరు, కొల్లిపర, పాఠశాలలోకి తీసుకువచ్చే విధంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, ఆర్ఐ వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పేరిట లబ్ధిదారులను మోసం చేసిన కాంట్రాక్టర్ను రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ' నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో లబ్ధిదారులకు ప్రభుత్వం స్థలం కేటాయించి, గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ క్రమంలో పెదరావూరు లేఔట్‌లో ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స్ పేరిట పట్టణ 24వ వార్డు శాంతినగర్‌కు చెందిన కాంట్రాక్టర్ కమ్ ఏజెంట్ ఎం. పున్నారావు గృహ నిర్మాణానికి ముందుకు వచ్చాడు. లబ్ధిదారులతో అగ్రిమెంట్లు చేయించుకొని ఏ ఒక్క ఇంటిని పూర్తిగా నిర్మించకుండా, కొంత మాత్రమే పనులు చేసి వదిలేశాడు. బుర్రిపాలెం, నేలపాడు లేఅవుట్‌లలో కూడా ఇదే విధంగా వ్యవహరించడంతో గతంలో అతడిని చేశారు. పెదరావూరు లేఅవుట్ విషయంలో నిందితుడిని పీటీ వారెంట్ పై నరసరావుపేట సబ్ జైలు నుంచి తీసుకువచ్చి సోమవారం కోర్టులో హాజరు పరచగా అతనికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు. వెంటనే తిరిగి నరసరావుపేట సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు.